క్లుప్తంగా

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ఎదులాపురం: పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో సోమవారం అనుబంధ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం లేబర్ కార్డు ఫలాలను పొందడం, లేబర్ కార్డు ఆవశ్యకత గురించి కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు సిర్ర దేవేందర్, కుంటాల రాములు, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి పెళ్లికి సాయం

గుడిహత్నూర్: మండలంలోని చెరకవాయి గ్రామానికి చెందిన ఆదివాసీ కొలాం గిరిజన దంపతులైన కొడప సోనేరావ్, అనితల కుమార్తె జ్యోతి వివాహం ఈనెల 4న జరగనుంది. దీంతో పేదరికం వల్ల పెళ్లి ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నారని తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన జైదేవీ మెడికల్ నిర్వాహకుడు మదన్ గిత్తే పెళ్లి భోజనానికి అవసరమైన నిత్యావసర సరుకులతో పాటు రూ. 5వేల నగదు అందజేశాడు. మదన్ గతంలో కూడా పేదలకు వివిధ రకాలుగా సహాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడి రాజీనామా

గుడిహత్నూర్: బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తరుణ్ గిత్తే తన బాధ్యతలకు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని మండలాధ్యక్షుడికి సమర్పించారు. పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం లభించడం లేదని పార్టీ సభ్యత్వానికి, ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

బేల: మండలంలోని సాంగిడి గ్రామ శివారులోని పెన్‌గంగ తీరాన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించనున్న శివాలయానికి సోమవారం వేద పండితులు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డిలు వేర్వేరుగా హాజరై నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిప్ప రమేశ్, సిద్రపు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్న పెయింటర్‌తో పనులు చేయించుకోవాలి



మాట్లాడుతున్న వాసుదేవ్

ఎదులాపురం: గుర్తింపు కార్డులు ఉన్న పెయింటర్స్‌తోనే యజమానులు పనులు చేయించుకోవాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు లాంటిలే వాసుదేవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. సంఘానికి ఏ ఇతర ట్రేడ్ యూనియన్‌లతో సంబంధం లేదని, ఇక నుంచి యూనియన్ స్వతంత్రంగా పని చేస్తుందన్నారు. గుర్తింపు కార్డులు ఉన్న పెయింటర్‌లతోనే పనులు చేయించుకోవాలని, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు యజమానులకు ఉపకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సందీప్, వసీం, రాంకిషన్, కౌసర్, జైరాజ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌ది మొసలికన్నీరు'

ఖానాపూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడూ రైతుల సమస్యలను పట్టించుకోలేదని.. కానీ నేడు అధికారం పోగానే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో మాట్లాడారు. రైతు సమస్యలపై ప్రతిపక్షాలు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులను సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలరాసిందన్నారు. సాగు, తాగునీటి సమస్య తలెత్తకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వందరోజుల్లో అమలు చేసిన ఏకైక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో నిలుస్తుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా సంప్రదించాలని ప్రజలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. దర్శనాల వెంకటేశ్, సుతారి రాజేశ్వర్, బల్గం భీమన్న, ప్రేమ్, నడిపి నర్సయ్య పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్లే దిక్కు



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

- అడుగంటిన భూగర్భజలాలు
- తాగునీటికి తప్పని తిప్పలు
- ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని గట్టెపల్లి పరిధిలోని కొలాంగూడలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. వేసవి వస్తే చాలు గ్రామంలోని బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రతీ సంవత్సరం అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తేనే గిరిజనుల అవసరాలు తీరుతాయి. వ్యవసాయ, ఉపాధి పనులు పక్కన పెట్టి దినమంతా తాగునీటి సేకరణ కోసం ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి నీటి సమస్య రాకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.



అడుగంటిన బావి

వేసవి వస్తే చాలు..

మండలంలోని గట్టెపల్లి పరిధిలోని కొలాంగూడలో గత 40 సంవత్సరాల నుంచి 24 కొలాం ఆదివాసీ గిరిజన కుటుంబాలు, 105 మంది జనాభా నివాసం ఉంటున్నారు. గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రెండు బావులు, రెండు బోరు బావులతో పాటు సమీపంలో ప్రైవేట్ బావులు, రెండు బోరు బావులు ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు దంచికొట్టడంతో గ్రామంలోని మంచి నీటి పథకాల్లో, బావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో తాగునీటి కోసం గిరిజనులు అల్లాడుతున్నారు. భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో గత మూడు రోజులుగా గ్రామపంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు.

సరఫరా కాని భగీరథ నీరు..

మండలంలోని మారుమూల గ్రామమైన కొలాంగూడ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. వారానికి రెండు రోజులు మాత్రమే భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామస్తులకు నీరు సరిపోక ట్యాంకర్ల నీటిపై ఆధారపడుతున్నారు. ఇప్పటికైనా భగీరథ నీటితో పాటు గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా ప్రతీ రోజు నీటిని సరఫరా చేయాలని కొలాం గిరిజనులు కోరుతున్నారు.

బోరు వేసినా.. నీరు రావడం లేదు



తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ కూడా నీరు లేదు. మంచి నీటి పథకాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. బోర్లు వేసినా.. నీరు రావడం లేదు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.

– కొడప మారుతి, కొలాంగూడ

ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలి



సిరికొండ: కవాతు చేస్తున్న పోలీసులు

సిరికొండ: ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ భీమేష్ అన్నారు. సోమవారం సిరికొండ మండల కేంద్రంలో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజల్లో భయాందోళనలు పోగొట్టేందుకే కవాతు చేస్తున్నట్లు పేర్కొన్నారు, ఇందులో ఎస్సై నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



తాంసిలో..

తాంసి: మండలంలోని పొన్నారి, తాంసి, కప్పర్ల గ్రామాల్లో సోమవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. త్వరలో జరగున్న పార్లమెంట్ ఎన్నికలు నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు కేంద్ర బలగాలతో కవాతు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు. వారి వెంట ఏఎస్సై కేశవ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

తాంసి: 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవాలని భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్ సూచించారు. సోమవారం భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. మొదటగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటు హక్కుకు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఓటుహక్కుపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాకారులు రమేశ్, వెంకట్రావు, శంకర్, మజీద్, రాజన్న, సంతోష్, అనిల్ పాల్గొన్నారు.



గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సై

కామ్రేడ్ కిరణ్ ఆశయాలను నెరవేర్చాలి

ఎదులాపురం: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు, తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కిరణ్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవనంలో సోమవారం కిరణ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆటో కార్మిక సంక్షేమం కోసం కిరణ్ ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. అంతే కాకుండా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్, ఉమ్రే సచిన్, మధుకర్, బుచ్చిరాం, రాజు, నరేశ్, రేణుక, అంజలి, రుక్మాబాయి పాల్గొన్నారు.



కిరణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తలమడుగు: కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులైన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మంత్రి సీతక్క, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, డీసీసీడీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరా రు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించా రు. బీఆర్‌ఎస్‌లో ఉద్యమకారులకు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ మహిళల సంక్షేమ కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిందన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.15 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విగ్రహ ప్రతిష్ఠాపన, పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గోపూజ, విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉత్తమ సేవలు అందించిన వారికి గుర్తింపు



సుశీలను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన యేర సుశీలను సోమవారం మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అర్ష రమేశ్, సాయిబాబా, క్రాంతి కుమార్, ప్రశాంత్, సూర్యవరప్రసాద్, బేర శ్రీనివాస్, అర్ష దేవిదాస్, ఎంబడి మధుసూదన్, స్వామి, వంశీ, పెరమండ్ల నారాయణ, సుధీర్ పాల్గొన్నారు.


అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: రెడ్డి యువత ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న అన్నదానం కొనసాగుతోంది. శివసాయి మిల్క్ సెంటర్ యజమాని రాంరెడ్డి అన్నదానం చేశారు. బీజేపీ జిల్లా నాయకుడు లోక ప్రవీణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భోజనం వడ్డించారు.

సరుకులు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన అనుప లక్ష్మి–రాము అనే నిరుపేద కుటుంబం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసి పట్టణానికే చెందిన వోకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు బాధిత కుటుంబానికి చేయూతనిచ్చాడు. సోమవారం వోకేఆర్ మిత్ర బృందం మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కాగా వారికి మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

'నోటిని అదుపులో ఉంచుకోవాలి'



మాట్లాడుతున్న అస్తక్ సుభాశ్

ఎదులాపురం: కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి తన నోటిని అదుపులో ఉంచుకుని మాట్లాడాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. బీజేఎల్‌పీ నేత మహేశ్వర్‌రెడ్డిపై కేఎస్‌ఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మహేశ్వర్ రెడ్డిని విమర్శించే స్థాయి కేఎస్‌ఆర్‌కు లేదన్నారు. వెంటనే మహేశ్వర్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం



పీహెచ్‌సీ ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లు

- పచ్చదనంతో కళకళలాడుతున్న తాంసి పీహెచ్‌సీ
- మొక్కల సంరక్షణపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ
- ఆహ్లాదకరమైన వాతావరణంలో వైద్య సేవలు

తాంసి: మండల కేంద్రంలోని తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేసవిలో కూడా పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. పీహెచ్‌సీలో వైద్యసేవలను రోగులు సద్వినియోగం చేసుకుంటూ.. చెట్ల నీడన సేద తీరుతున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ప్రభుత్వం చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది, స్థానిక యువత సహకారంతో విరివిరిగా మొక్కలు నాటారు. ప్రతీరోజు నీరు పోసి మొక్కల సంరక్షణ చేపట్టడంతో ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రం ఆవరణ మొత్తం పచ్చదనం సంతరించుకుంది. ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు చెట్ల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈరోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులను సైతం ఆకర్షిస్తున్నాయి.

ఆహ్లాదం పంచేలా మొక్కల పెంపకం..

ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఆహ్లాదాన్ని పంచేలా వివిధ రకాల ఆకర్షణీయమైన మొక్కలు నాటారు. ఆరోగ్య కేంద్రంలోని ప్రహరీ చుట్టూ పలు రకాల పూల మొక్కలు నాటారు. వేప చెట్లు ఏపుగా పెరిగి ఆకుపచ్చగా కనిపిస్తున్నాయి. గేటు బయట కూడా రెండు వైపులా రాగి చెట్లు నాటారు. వీటితో పాటు ఆస్పత్రి ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో జామ మొక్కలను నాటారు. నాటిన మొక్కల సంరక్షణ చేపడుతూనే ఇతర మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. రోజువారీగా వైద్య సిబ్బంది సమయం కేటాయిస్తూ బోరు ద్వారా నీరు అందిస్తున్నారు. రోగులు, వారి సహాయకులు కూర్చునే విధంగా సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. దీంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఆహ్లాదంతో పాటు ఆనందం పొందుతున్నారు. ఇక్కడి వైద్యసేవలతో పాటు పచ్చదనం ఉండడంతో గత ఏడాది ఆగస్టులో ఢిల్లీకి చెందిన బృందం సభ్యులు పరిశీలించారు. ఆరోగ్య సేవలను గుర్తించిన 90.64 మార్కులు ప్రకటించి ఎన్‌క్వాస్ గుర్తింపు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

సిబ్బంది సహకారంతో

ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. వారి సహకారంతో నిత్యం మొక్కల సంరక్షణ చేపడుతున్నాం. ప్రతీ రోజు నీరు అందించి, ఆరోగ్య కేంద్రం పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపడుతున్నాం. రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో వైద్య సేవలు అందించడం ఆనందంగా ఉంది.

– శ్రావ్య వాణి, వైద్యాధికారి

'చేరికలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు'

జైనథ్: కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీలో చేరికపై ఉన్న శ్రద్ధ, రైతుల సమస్యలపై లేదని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మండిపడ్డారు. సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు, రైతులతో కలిసి మండలంలోని ఖాప్రి, కరంజి, ఉమ్రి గ్రామాల్లో పర్యటించారు. సాగునీరు అందక ఎండిపోయిన జొన్న, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడంలో విఫలమైందన్నారు. 24గంటల విద్యుత్, రైతుబంధు, రైతు కూలీలకు పెట్టుబడి సాయం ఏమైందని ప్రశ్నించారు. ఐదు ఎకరాల లోపు వారికి రైతుబంధు ఇచ్చామని చెబుతున్నప్పటికీ చాలా మంది రెండెకరాల లోపు రైతులకు కూడా రైతుబంధు రాలేదన్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నర్సన్ లింగారెడ్డి, భట్టు ఊశన్న, మహేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



కరంజిలో ఎండిన మిర్చి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: క్షయపై హెల్త్ కేర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని షేర్ ఇండియా వైద్యులు సతీష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో క్షయ నివారణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో పనిచేసే వైద్య సిబ్బందితో సమావేశం అయ్యారు. క్షయ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మాస్కులు, గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలన్నారు. రోగులకు త్వరితగతిన చికిత్స అందిస్తే వ్యాధి నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో క్షయ నివారణ కేంద్రం మెడికల్ ఆఫీసర్ సాయిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సతీష్

'బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి'

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు బోథ్ మండలానికి వచ్చిన సందర్భంగా నాయకులు కార్యకర్తలతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేత ఆదివాసీల ఉద్యమకారుడు ఆత్రం సక్కు గెలుపు కోసం కష్టపడి పనిచేయనున్నట్లు తెలిపారు. మూడు నెలల కాంగ్రెస్ పాలనను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీజేపీ హయాంలో పార్లమెంట్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. కర్షకులు, కార్మికులంత బీఆర్‌ఎస్ వైపు ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోథ్, భీంపూర్ జెడ్పీటీసీలు సంధ్యారాణి, కుమరం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సోమవారం బోథ్ అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణలో పీవో, ఏపీవోలతో పాటు వోపీవోలు పాల్గొన్నారు. ఎన్నికలలో పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ తుకారాం తెలి పారు. మరో రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు.